# మహాయానం

## వేమూరి వేంకటేశ్వరరావు

ఇది కలా? నిజమా? వైష్ణవ మాయా?

ఒకటి కాదు! రెండు కాదు!! ఇంటి నుండి మూడు వేల జ్యోతిర్‌వర్షాల దూరం.
మూడు వేల జ్యోతిర్‌వర్షాల దూరం అంటే మాటలా? ముప్ఫయ్ పద్మ కిలోమీటర్ల దూరం. లేదా, ముప్ఫయ్ క్వాడ్రిలియను కిలోమీటర్ల దూరం. అంటే, 30 000 000 000 000 000 కిలోమీటర్ల దూరం. ఇంత దూరం ఈ రాకెట్‌లో రాగలగడమే అచింత్యం, అప్రమేయం, దుర్‌గ్రాహ్యం. ఈ దూరాన్నంతటినీ ఒక్క సాంకేతిక యంత్ర తంత్రాంగాలతో మాత్రమే అధిగమించడం సాధ్యపడే విషయం కాదన్న విషయం ఆకళింపుకి రాగానే సాంకేతిక తంత్రంతో యోగతంత్రం మేళవించి ఈ దూరాన్ని మూడేళ్ల వ్యవధిలో అధిగమించగలిగేం. అసలు ఈ యోగతంత్రపు మెలిక లేకపోతే ఈ రాకెట్‌లో ప్రయాణీకుడిగా నాకు అవకాశమే దొరికి ఉండేది కాదేమో.

గమ్యం చేరుకున్నాం. చెయ్యవలసిన కార్యక్రమాలు చేసేం. చూడ వలసినవి చూసేం. బరువైన హృదయంతో తిరుగు ముఖం పట్టేం. నభోనౌకలో ఉన్న పరివారం అంతా దీన వదనాలతో దిగాలుగా, నిశ్శబ్దంగా ఉన్నారు. వచ్చిన పని పూర్తి అయిందన్న ఉత్సాహం ఎవరి ముఖన్నా వీసమెత్తు లేదు.

జరిగిన విషయం నేను ఎవ్వరితోనూ చెప్పదలుచుకో లేదు. నేను చెప్పక పోయినంత మాత్రాన దాగుతుందా? జరిగినదంతా వందల కొద్దీ విడియో టేపుల మీద, వేల కొద్దీ ఛాయాచిత్రాలలోను పూస గుచ్చినట్లు నమోదు చెయ్యబడ్డాది. ఇవన్నీ మాతో తిరిగి ఇంటికి మోసుకు పోతున్నాము కదా!

క్రీస్తు శకం ఇరవైయవ శతాబ్దపు ఉత్తర భాగంలో రోదసి మీద మొట్టమొదట ముమ్మరంగా పరిశోధనలు జరిగేయి. ఆ రోజులలో సైనిక, వైమానిక దళాలలోని దళపతులని నభోనౌకలకి చోదరులుగా ఎన్నుకోవడం పరిపాటిగా ఉండేది. రానురాను ప్రజాస్వామ్యపు ప్రభావం వల్ల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల దగ్గర నుండి ప్రజలలోని అన్ని వర్గాల మనుష్యులని రాకెట్‌లో పైకి పంపించడం జరిగింది. ఇప్పుడో? రోదసిలో ప్రయాణం బస్సు ప్రయాణంలా తయారయింది.

దూరాన్న మెరుస్తూ కనిపిస్తూన్న నక్షత్రాలని చూస్తూ రాకెట్ యొక్క కిటికీ దగ్గర నిలబడి నా మస్తిష్కంలో చెలరేగుతూన్న ఆలోచనా తరంగాలతో కుస్తీ పడుతూ, నాలో నేనే ఇలా స్వగతంగా గొణుగుకుంటున్నాను.

''సృష్టికర్త హస్తకౌశలం ఈ విశ్వంలో ఏ మూల చూసినా ద్యోతకం అవుతూనే ఉంటుందని చెప్పడానికి ఇంత కంటె నిదర్శనం ఏమిటి కావాలి?''

'బోరు' కొడుతూన్న బస్సు ప్రయాణంలో సందు దొరికితే చాలు పక్క వాడితో 'హస్కు' కొట్టడానికి ఎదురు చూస్తూన్న వాడిలా నెవిల్ లూమన్ అందుకున్నాడు.

''ఈ విధ్వంస కాండ చూసిన తర్వాత ఆ స్రష్ట దీనంతటినీ ఏ ప్రయోజనం ఆశించి సృష్టించేడో అర్థం అవడం లేదు.''

డాక్టర్ లూమన్ నా పరిశోధక వర్గంలో ఉన్న తోటి ప్రయాణీకుడు. మిగిలిన శాస్త్రవేత్తలలాగే, ఇతను కూడ ఒక మోస్తరు నాస్తికుడు. 'స్రష్ట,' 'సృష్టి' మొదలైన మాటలు వాక్యంలో వాడినా అవి అతనికి ఉత్త ఊత పదాలు.

క్రీస్తు శకం పదమూడవ శతాబ్దారంభంలో ఆధునిక పాశ్చాత్య నాగరికతకి పునరుద్ధరణ మొదలయింది. నాటి నుండీ, యంత్రీభూతమైన పాశ్చాత్య దృక్పధం చెలరేగి, ప్రపంచం అంతటినీ పెను తుఫానులా చుట్టుముట్టింది. ఆ సందర్భంలో రెనే డెకా, స్పినోజా, ఇమ్మేన్యువల్ కాంట్ మొదలైన తత్వశాస్త్రపు హేమాహేమీలు పునాదులు వేసి లేవనెత్తిన హేతువాద సౌధపు నిర్మాణం డార్విన్ సిద్ధాంతంతో బలం పుంజుకుని, ఇరవైయ్యవ శతాబ్దం నాటికి పూర్తి అయింది. ఆ సౌధపు ప్రాంగణంలో నిర్మించబడ్డదే ఈ నభోనౌక. ఈ నౌక విన్యాసానికీ, రూపకల్పనకీ తోడుపడ్డ వ్యక్తి డాక్టర్ లూమన్. ఇది అతని కపాల కల్పితం. దేవుళ్ల గురించి దయ్యాల గురించి చేసే చర్చలు అతని చెవికి ఎక్కవు. అంతా మన చేతుల్లోనే ఉందనే రకం.

"మనమంతా దేవుడి బిడ్డలం. వాడి నామధేయమే 'కరుణామయుడు' అనే నమ్మకంతో పెరిగిన నాకు వాడి ఈ ప్రవర్తన ఎంతగా ప్రయత్నించినా అవగాహన కావడం లేదు. ఏ ప్రయోజనం ఆశించి ఈ పని చేసేడో నాకు ఆకళింపుకి రావడం లేదు." నభోనౌక నాయకుడు, ఫాదర్ స్మిత్ వంత కలుపుతూ మా కబుర్లలోకి తనూ దిగేడు.

క్రైస్తవ మతంలోని రోమన్ కేథలిక్ శాఖలో గురుతుల్యుడు అయిన ఫాదర్ స్మిత్ నభోనౌకకి నాయకుడేమిటా అని ఆశ్చర్యపోనక్కర లేదు. ఫాదర్ స్మిత్ ప్లేనెటరీ ఫిజిక్సులో పి. హెచ్. డి. పట్టా పుచ్చుకుని బాగా పేరు తెచ్చుకున్న ఘటికుడు. వివేకానందుడి నిర్వచనం ప్రకారం ఇతనొక కర్మ యోగి. ఈ బృహత్కార్య నిర్వహణకి సాయుధ బలాలలోని సైనికుల కంటె మతాధిపతులు, యోగులు ఎక్కువ ఉపయోగం అని ఒక నిర్ణయం జరిగింది. అందుకనే ఈ జోగులంతా ఆ నభోనౌకలో భుజాలు రాసుకుంటున్నారు.

దేవుడి ఉనికి మీద నమ్మకం సన్నగిల్లుతూన్న వాళ్లల్లో ఆధునిక శాస్త్రజ్ఞులు మెండుగా ఉన్నారు. స్థూలంగా చెప్పాలంటే ఆస్తిక మతాలమీద నమ్మకం ఉన్నవాళ్లంతా – అంటే, హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, మొదలగు వారు – దేవుడి ఎడల అయిదు విషయాలలో అయిక్యతా భావాన్ని వెలిబుచ్చుతారు. మొదటిది దేవుని అద్వితీయత్వం. రెండు, దేవుని సృష్టికర్తృత్వం. తర్వాత ఆయన సర్వశక్తిత్వం, సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం.

సూక్ష్మంగా పరిశీలిస్తే మతాలలో చిన్న చిన్న తేడాలు లేకపోలేదు. 'వాడు కరుణామయుడు, ఆశ్రిత పక్షపాతుడు, ఉత్తములని రక్షించి పాతకులని శిక్షిస్తాడు' అనే నమ్మకాలు అందరిలోనూ ఉన్నా, 'దేవుడు ఎటువంటి వాడు?' అన్న ప్రశ్న వచ్చినప్పుడు మాత్రం ఈ నమ్మకాలలో కొద్ది కొద్ది తేడాలు కనిపిస్తాయి. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, నిందాస్తోత్రాలు, మంచిచెడ్డలు, రాగద్వేషాలు, పాపపుణ్యాలు, మొదలైన ద్వంద్వ భావాలకి దేవుడు అతీతుడని హిందువులు నమ్ముతారు, కాని క్రైస్తవులు అలా అనుకోరు. హిందువులలోని అద్వైత మతస్థుల నమ్మకాలని క్రైస్తవుల నమ్మకాలతో పోల్చి చూస్తే మరొక తేడా కనిపిస్తుంది. ఈ సృష్టి అంతా భగవత్స్వరూపమే అని హిందువులు నమ్ముతారు; వారికి విశ్వమే విష్ణువు. కుమ్మరికి కుండలకి తేడా ఉన్నట్లే జగత్తుకి ఈ జగద్రచనా వ్యాపారానికి అధ్యక్షత వహించిన భగవానుడుకి తేడా ఉందంటారు క్రైస్తవులు. హిందువులలో విశిష్టాద్వైతాన్ని పాటించే వైష్ణవుల నమ్మకాలు ఈ విషయంలో క్రైస్తవుల నమ్మకానికి కొంచెం దగ్గర అనిపిస్తుంది.

సుదూరంలో నెమ్మదిగా వెనక్కి వెళుతూన్న నక్షత్ర మండలాల గమనాన్ని బట్టి, రాకెట్ ఇంజను చేస్తూన్న అతి నిశ్శబ్దమైన బుస వంటి ధ్వనిని బట్టి తప్పితే ఆ శూన్యంలో కదులుతూన్న భ్రమే లేదు.

''ఇదంతా వాడి లీల. ఈ జగన్నాటక సూత్రధారుడి ఆటలో మనమంతా పావులం మాత్రమే. 'ఈ సృష్టి ఎందుకు జరిగింది? ఈ సృష్టి ప్రయోజనం ఏమిటి?' మొదలైన ప్రశ్నలని అడిగే కుతూహలం మనకి ఉన్నప్పటికీ, వీటిని అర్థం చేసుకునే స్థోమత మానవ మేధకి లేదు.'' నా వేదాంత ధోరణిలో నాకు తోచిన మాట నేను కలిపేను.

ఈ నభోనౌకని నిర్మించి, పరిశోధన నిమిత్తం మూడు వేల జ్యోతిర్వర్షాల దూరం పంప గలిగిన జాతికి మేధా శక్తి లేదని అన్న నా మాట విరుద్ధోక్తిలా స్ఫురించిందో, లేక నా వేదాంతపు ధోరణి నెవిల్‌కి అర్థం కాలేదో ఏమో, ప్రశ్నార్థకంగా నా వేపు చూసి,

'''ఈ సృష్టి ఎందుకు జరిగింది? ఈ సృష్టి ప్రయోజనం ఏమిటి?' వంటి ప్రశ్నలకి సమాధానం సైన్సులోనూ లేదు. ఈ సృష్టి ఎలా జరిగిందో చెప్పడానికి సైన్సు ప్రయత్నించ గలదు కానీ, ఎందుకు జరిగిందో, దీని ప్రయోజనమేమిటో సైన్సు కూడా చెప్పలేదు. ప్రయోగశాలలో ఎలక్ట్రాను గరిమ ఎంతుందో, ప్రోటాను గరిమ ఎంతుందో తూకం వేసి చెప్పగలను కానీ, 'ఆయా కణాలకి అంతంత గరిమలే ఎందుకు ఉండాలి?' అని అడిగితే నేనూ చెప్పలేను. ఈ సృష్టి ప్రయోజనం మాటంటావా? ఏమో.....''

ఈ ప్రశ్నకి సమాధానంగా నేనే చొరవ తీసుకుని సంభాషణ పొడిగించేను.

''సముద్రపుటొడ్డున పిల్లలు ఇసకలో గుడి కట్టడం చూసే ఉంటారు?''

''చూసేను.''

''పిల్లలు ఎంతో కష్టపడి గుడులు, గోపురాలు కడతారు. కట్టి, కాసేపు ఆడుకుని, కాలితో తన్నేసి, ఆ మట్టి ఉవ్వెత్తున పడి లేచే కడలి తరంగాలలో కలసి పోతే, మరి కొంచెం ఎగువకి జరిగి మరొక మేడ కడతారు. అదొక హేల. అంతే!

''పేక మేడలు కట్టే పిల్లడిని ఒక సారి చూసేను. గంటల కొద్దీ శ్రమించి, నిలువెత్తు మేడ కట్టేడు. పది నిమిషాల పాటు తన సృజనాత్మక శక్తిని చూసుకుని ఆనందించిన తర్వాత, నెమ్మదిగా వెళ్లి ఉఫ్ అని ఊదేసి మేడని పడగొట్టేసేడు.

''సైకత స్థలిలో సౌధాలు నిర్మించిన వాడినీ, పేక మేడలు కట్టిన వాడినీ 'ఏ ప్రయోజనం ఆశించి కట్టేవురా?' అంటే 'సరదాకి' అనే చెబుతాడు, 'ఎందుకు పడగొట్టేవురా?' అన్నా 'సరదాకి' అనే చెబుతాడు. అలాగే ఈ సృష్టికర్త కూడా ఒక ఆట వలె ఈ గ్రహాలనీ, నక్షత్రాలనీ, గేలక్సీలని సృష్టించి, నడిపించి, లయింప జేస్తున్నాడు.

''మా గీతలో కృష్ణపరమాత్మ 'కాలోస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో, లోకా స్సమాహర్తు మిహ ప్రవృత్తః' అన్నాడు . దీని అర్థం ఏమిటో తెలుసా? 'కాలస్వరూపుడను నేనే. లోకములను పెంపొందించి నశింప చేయువాడను నేనే. లోక సంహారమును ప్రవృత్తిగా కలవాడను నేనే.'

''మన భూలోకంలో మానవుడు పుట్టి పట్టుమని మూడు ఆదివారాలు అవలేదు. భూలోకపు చరిత్రలో మన ఉనికి కేవలం బుద్బుదప్రాయం. అటువంటి మనం ఎంత ఎదిగి పోయేం? ఎదిగి పోయి సృష్టికర్త మనో ప్రవృత్తి మీద వ్యాఖ్యానాలు చేస్తున్నాము. ఆహాఁ.

''అన్ని జన్మలలోకి మానవ జన్మ ఒక్కటే ఉత్కృష్టమైనదనిన్నీ, ఈ సృష్టి అంతా వాడు మన కోసమే – అంటే మానవుల కొరకే – చేసేడనిన్నీ, ఈ మానవుడి చుట్టూ ఈ విశ్వం అంతా పరిభ్రమిస్తోందనిన్నీ భ్రమ పడడం యంత్రీభూతమైన పాశ్చాత్య నాగరికతా ప్రభావం. ఇది శుద్ధ కుక్షింభరత్వం, భౌతికవాదం.'' అంటూ నా మనస్సులోని ఆలోచనా పరంపరకి వాగ్రూపం కల్పించేను.

అసలు ఈ నభోసాగరం దాటడానికి మేము 'మహాయానం' అనే పేరుతో నిర్మించిన ఈ నభోనౌకలో జరిగిన ప్రయాణం కలిగించిన మనస్తాపానికి, ఆ మనస్తాపం ప్రేరేపించిన ఈ చర్చకి కారణం చెబుతాను.

ఇరవైయవ శతాబ్దాంతంలో మానవుడు నభోనౌకలు నిర్మించడం నేర్చుకున్న తర్వాత నక్షత్రాలు పేలిపోగా మిగిలిన అవశేషాల మీద పరిశోధన పుంజుకుంది. ఈ పరిశోధనలకి గాను విశ్వాంతరాళపు లోతులలోకి దూసుకు పోయే శక్తి గల ఒక పెద్ద పడవని నిర్మించేం. బౌద్ధమతం మీద అభిమానం ఉన్న ఒక ఆసామీ సలహా ప్రకారం ఈ పెద్ద రాకెట్ పడవకి 'మహాయానం' అని పేరు పెట్టాలని నిశ్చయం చేసేరు. 'మహాయానం' అంటే పెద్ద పడవ అని అర్థం. పెద్ద పెద్ద పడవలని సముద్రంలోనే అట్టేపెట్టి, రేవు లోపలికి చిన్న చిన్న పడవలని తోలుకు వచ్చినట్లు, 'మహాయానం' కి అనుబంధంగా 'హీనయానం' అనే ఒక చిన్న పడవని నిర్మించేం.

ఈ కథ ఇంకా ముందుకి జరిగే లోగా ఖగోళశాస్త్రం గురించి చిన్న పాఠం చెబుతాను. ఆకాశంలో మన కంటికి కనిపించే నక్షత్రాలన్నీ మినుకు మినుకు మంటూ ఒకేలా కనిపించినా నిజానికి మనిషికి మనిషికి ఎంత తేడా ఉందో నక్షత్రానికి నక్షత్రానికి అంత తేడా ఉంది. మనిషికి పుట్టుకా, యవ్వనం, తదుపరి మరణం ఉన్నట్టే నక్షత్రాలకి కూడ పుట్టుక, గిట్టుక ఉన్నాయి. మన సూర్యుడి లాంటి నక్షత్రాల జీవితాలు పెద్ద చెప్పుకో తగ్గ విశేషాలేమీ లేకుండా సజావుగా జరిగి పోతాయి. కాని కొన్ని నక్షత్రాలు నడి వయస్సులో ఉండగానే దేదీప్యమైన కాంతి వెదజల్లుతూ పేలిపోతాయి. వీటినే 'నోవా'లు అంటారు. ఈ నోవాలలోనే రెండు రకాలు: సాధారణంగా పేలేవి సాధారణ నోవాలు, బ్రహ్మాండంగా పేలే రకాలు సూపర్ నోవాలు. ఈ విశాల విశ్వంలో, సహస్రాబ్దానికి నాలుగైదు చొప్పున, ఎక్కడో ఒక చోట బృహన్నోవాలు ఇలా పేలిపోవడం రివాజే అని అంచనాలు వేసేరు.

ఒక నోవా కాని, బృహన్నోవా కాని పేలిందంటే మినుకు మినుకుమంటూ ఉండే నక్షత్రం కాస్తా ఒక్క సారి దేదీప్యమానంగా వెలిగి పోతుంది. అలా వెలిగినప్పుడు ఆ నక్షత్రం వెయ్యి సూర్యుల ప్రభతో ప్రకాసించి భూలోకంలో ఉన్న మనుష్యులకి పట్ట పగలు కూడా కనిపించి వారి దృష్టిని రెండు మూడు వారాలపాటు ఆకట్టుకుంటుంది. తర్వాత క్రమేపీ శక్తి క్షీణించగా కంటికి కనిపించకుండా పోయే సావకాశం లేక పోలేదు. క్రీస్తు శకం 1054లో ఇటువంటి బృహన్నోవాని ఒకదానిని చైనాలోని ఖగోళశాస్త్రజ్ఞులు గమనించి నమోదు చేసేరు. ఐదు శతాబ్దాల తరువాత, క్రీస్తు శకం 1572లో శర్మిష్ఠ నక్షత్రరాసిలో మరొక బృహన్నోవా పేలిపోయింది. దుర్భిణీ యంత్రాలు విరివిగా వాడకంలోకి వచ్చిన ఈ రోజులలో నక్షత్రాలు పేలిపోగా మిగిలిన అవశేషాలు దూది పింజల లాంటి తేజోమేఘాలలా ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి.

ఈ నోవాలకి మల్లే మన సూర్యుడి యొక్క గ్రహపాటు కూడ వక్రిస్తే మన గతి ఏమిటవుతుందని కొంత మందికి ఒకానొకప్పుడు అనుమానం పట్టుకుంది. అటువంటి గతి మన సూర్యుడికి పట్టదనిన్నీ, మన సూర్యుడు నోవాగా కానీ, బృహన్నోవాగా కాని మారడానికి సిద్ధాంతం ఒప్పుకోదనిన్నీ ఎంత మంది ఎంతలా వాదించినా,

ఈ నీహారికల మీద పరిశోధన ఆగ లేదు. ఈ కార్యక్రమంలోనే నేను, డాక్టర్ లూమన్, ఫాదర్ స్మిత్ ప్రభృతులం మహాయానంలో ఇక్కడకి వచ్చేం.

'అంతా ఎప్పుడో అయిపోయింది' అని తెలిసి కూడా పరామర్శ చెయ్యడానికి వచ్చిన దూరపు బంధువులులా వచ్చేం. ఇల్లు తగలబడి పోయిన తర్వాత కాని, విమానాలు కూలిపోయిన తర్వాత గాని పత్తేదారులు వచ్చి, 'ఈ ప్రమాదం ఎందుకు జరిగింది? మళ్లా ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?' అంటూ పరిశోధన చేసినట్లే మేమూ అటువంటి ప్రశ్నల పుస్తకం ఒకటి మాతో పట్టుకొచ్చేం – చెయ్యగలిగేది ఏదీ లేదని తెలిసి కూడా!

ఎప్పుడో వేల సంవత్సరాల కిందట పేలిన పేలుడు యొక్క జోరు ఇప్పటికీ తగ్గినట్లు లేదు. పల్చటి ధూళి రేణువులు, వాయు తెరలు, నభోనౌకని వచ్చి తాకడం మొదలవగానే నిద్రలో ఉన్న మా ఉపకరణాల మీటలని నొక్కి లేవగొట్టేం. ఎంతో వేడిగా ఉన్న ఈ వాయు కణాలు ఇప్పటికీ, ఇన్నాళ్లు పోయినప్పటికీ, అత్యాద్భుతమైన కాంతులీనుతూ ప్రకాశిస్తున్నాయి. సుదూరంలో, ఎక్కడో పేలిపోయిన నక్షత్రం యొక్క  అవశేషం ఉండే ఉండాలి. సూర్యుడిని పోలిన – అంటే, చంద్రశేఖర్ నియమించిన అవధిని మించని – నక్షత్రాలు అంత్య దశకి వచ్చే వేళకి శ్వేతకుబ్జతారలుగా మారతాయని మనకి తెలుసు. కాని సూర్యుడి కంటె వెయ్యి రెట్లు పైగా మించిన ఈ సూపర్ నోవా పేలిపోయిన తర్వాత మిగిలేది కాలరంధ్రం, లేదా 'బ్లేక్ హోల్.' ఈ కాలరంధ్రం కంటికి కనిపించని రోదసీ విశేషం. దీని సంఘటన దిక్చక్రం, లేదా 'ఇవెంట్ హొరైజన్' దగ్గరగా వెళితే మహాయానం పని హుళక్కి. అందుకని చాల అప్రమత్తతతో చోదకులు నభోనౌకని నడుపుతున్నారు.

అగ్ని దేవుడికి ఆహుతి అయిపోయిన ఇంటి మంటలని ఆర్పిన ఆరు నెలల తర్వాత ఎవరైనా బతికున్నారేమోనని ఆశ పెట్టుకోవడం పేరాశ అయినట్లే, ఎప్పుడో ఆరు వేల సంవత్సరాల కిందట పేలి పోయిన నక్షత్రమండలంలో గ్రహమండలాలు ఉంటాయేమోనని ఆశ పడి వెతకడం కూడ పేరాసే అవుతుంది. అలాగని పురుష ప్రయత్నం చెయ్యకుండా ఇంత దూరం వచ్చి రిక్త హస్తాలతో తిరిగి ఎలా వెళ్లడం? అందుకని మాట వరసకి, 'వైడ్ ఏంగిల్ ప్లేనటరీ కెమేరా'ని నిద్రలోంచి లేపి ఏదయినా గ్రహం కనిపిస్తుందేమో చూడమని కంప్యూటరుకి పని అప్పగించేం. కొద్ది సేపట్లోనే మన కాలరంధ్రానికి అత్యంత దూరంలో పరిభ్రమిస్తూ, ఉరవళ్లు తొక్కుతూన్న వరదలో కొట్టుకు పోతూన్న కట్టుమానులా, ఒకే ఒక చిన్న గ్రహం ఆ శూన్యాకాశంలో తేలుతూ కనిపించింది. కాలరంధ్రానికీ ఈ కనిపించిన గ్రహానికీ మధ్య దూరం మన సూర్యుడికీ, ప్లూటోకీ ఉన్న దూరం కంటె చాల రెట్లు ఎక్కువ ఉంటుందని మా వాళ్లు లెక్క కట్టి చెప్పేరు. నక్షత్రం పేలుడు యొక్క తీవ్రతకి తన మాతృకక్ష్య లోనుండి తొలగించబడి, తుళ్లి పడి, ఈ గ్రహం ఇంత దూరం వచ్చి ఉంటుందని నా అనునాయులు కొందరు తీర్మానించేరు.

ఇంత దూరంలో ఉన్న గ్రహానికి అందే వేడి, వెలుతురు పూజ్యం. కాని అంత మాత్రాన అటువంటి గ్రహం మీద ప్రాణి ఉండదని తీర్మానించడం అహంభావమే అవుతుంది. సూర్యరశ్మి సోకని సముద్రపు లోతుల్లో, భూగర్భపు లోతుల్లోంచి ఉబికి వచ్చే ఉష్ణపు ఊటలుండే ప్రాంతాలలో ప్రాణులు కనిపించేయి. కనుక ఏదో ఒక రకం ప్రాణి కనిపించడానికి సావకాశం లేకపోలేదు; అది మేధాశక్తి ఉన్న ప్రాణి కాకపోవచ్చు. ఇంత దూరం వచ్చి, తినబోతూ రుచి అడగడం ఎందుకని  మాలో ముగ్గురం హీనయానం ఎక్కి ఆ గ్రహం మీదకి దిగేం.  దిగి

చూసిన దృశ్యంతో మా మనస్సులలో చెలరేగిన అనుభూతులు 'ఇవీ' అని వర్ణించడానికి మాటలు చాలవు. ఒక పక్క ఆనందం. మరొక పక్క ఆశ్చర్యం. ఈ అనుభూతులు నసాళానికి అంటే లోగా ఆవేదన, విచారం, ఆగ్రహం ముంచెత్తుకు వచ్చేయి.

గ్రహం మీదకి దిగే ముందే, చాలా దూరం నుండే, రకరకాల కోణాలలో ఫొటోలు తీసి ఎక్కడ దిగడమో నిశ్చయం చేశాం. దూరం నుండే ఒక దీర్ఘచతురస్రాకారంలో ఒక పెద్ద కట్టడం లాంటి భవన విశేషం కనిపించింది. దాని ఆకారాన్ని బట్టి, దానినుండి ప్రతిధ్వనించి తిరిగి వచ్చిన రాడార్ వాకేతాలని బట్టి అదేదో సహజ సిద్ధమైన విశేషం కాదనిన్నీ, ఎవరో మేధాశక్తి సంపన్నులచే నిర్మించబడిందనీ ఎప్పుడో నిశ్చయం చేశాం. కనుక ఆ గ్రహం మీద దిగగానే ఆ భవన విశేషాన్ని వెతుక్కుని సమీపించేం.

చుట్టూ ఉన్న రాళ్లల్లోకి పాతుకు పోయి చూడడానికి పెద్ద ఉక్కు భోషాణంలా అనిపించింది. మేమంతా ఖగోళశాస్త్రంలో తరిఫీదు పొందిన వాళ్లం; మాకు పురావస్తు పరిశోధనలో ప్రవేశం పూజ్యం. అయినా సరే, పెల్లుబికి వస్తూ ఉన్న కుతూహలాన్ని అణచి పెట్టకోలేక చుట్టూ ఉన్న శిలావిశేషాలని చేతిలో ఉన్న పనిముట్లతోనే తంటాలు పడి తవ్వి, పక్కకి మెడ్డగించి, గదిలా ఉన్న ఆ భోషాణం లోపలికి ప్రవేశించడానికి ఒక బిలం రూపొందించేం. ఆ బిలం గుండా లోపలికి ప్రవేశించేం.

సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన నాగరికుల హస్తకౌశలం కొట్టొచ్చినట్లు కనిపించిందా కొట్లో. మన జుట్టు, కట్టు, బొట్టు మొదలైన బాహ్యాలంకార విషయాలనీ, అహార, విహార, శయన, పానీయాదులలోని ఆచార వ్యవహారాలనీ, ఆట పాటలనీ, మన జీవిత సరళినీ భావి తరాల వారికి అందజేయడానికి కాల గుళికలు ('టైం కేప్‌స్యూలు') చేసి పాతిపెట్టే ఆచారం మనకి ఎలా ఉందో అటువంటి ఆచారమేదో ఉన్న జాతి ఒక నిధిని చేసి అక్కడ ఆ పెట్లో పెట్టినట్లు అనిపించింది. ఈ కాల గుళికల ద్వారా వారి పాటలు విన గలిగేం. పసి పిల్లల ఆటలు చూడగలిగేం. వారి ఆశలు, ఆశయాలు, ఆసక్తులు అవగాహన చేసున్నాం. మేము చూసిన వాటిని బట్టి వారి పరిశోధనా పథకాలు, వారి పాఠశాలలు, వారి విశ్వవిద్యాలయాలు, ..., అన్నీ అకస్మాత్తుగా అగ్గిలో కాలి, నిర్ధూమధామములై బుగ్గిలో కలిసిపోయాయి.

అగ్నికి అలా ఆహుతి అయన ఆ జాతి, ప్రగతి పథంలో ఎంతో ఉన్నత స్థితికి ఎదిగింది. తమ పరిశోధనా నైపుణ్యంతో తమ మనుగడకి రాబోయే మహా విపత్తు గురించి తెలుసుకో గలిగిన మహా మేధావులు వాళ్లు! రోజు, రెండు రోజుల ముందు కాదు; శతాబ్దాల ముందే తమ సూర్యుడికి పట్టబోయే గతి, దుస్తితి వారికి అవగాహన అయింది. వారు తమ స్వంత గ్రహాన్ని వదిలేసి, వారి సూర్యుడికి – తద్వారాపేణా ఆసన్నమయే ప్రమాదానికి – దూరంగా మరొక గ్రహం మీదకి వలస వెళ్లి తమ జాతిని, జాతి నాగరికతని రక్షించుకుందామని ఈ గ్రహం మీదకి వచ్చినట్లు ఆ భోషాణంలో ఉన్న అవశేషాలని చూడగానే తేటతెల్లమయింది.

ఆ భోషాణంలో చిత్రపటాలు, ఛాయా చిత్రాలు, చలన చిత్రాలు, దృశ్యకావ్యాలు, మొదలైనవి ఎన్నెన్నో ఉండబట్టి భాషతో నిమిత్తం లేకుండా వారి చరిత్రని అవగాహన చేసుకో గలిగేం. వారి పట్టణాలని చూడ గలిగేం. ఇలా కిలకలా రావాలతో కలకలలాడుతూన్న వారి ప్రగతికి ఈ నోవా నక్షత్రపు పేలుడు లక్షణం వల్ల ప్రతిబంధకాలు వచ్చి పడ్డాయి. రాబోయే పెనుముప్పు నుండి రక్షణకి ఒక్కటే తరుణోపాయం. తమ సూర్య మండలాన్ని ఒదిలేసి పొరుగున ఉన్న అనుకూలమైన మరొక నక్షత్ర మండలం లోనికి వలస వెళ్లడం. ఎంత

సాంకేతిక సంపద సంపాదించిన వారైనప్పటికీ వారికి తమ నక్షత్ర మండలం వదలి వెళ్లడానికి వీలయిన రాకెట్ యంత్రాల నిర్మాణం లోని సూక్ష్మం అర్థం కాలేదు. చేయ గలిగేది ఏమీ లేక దీపంలో పడ్డ చిమ్మెటలలా ప్రళయ జ్వాలలకి ఆహుతి అయిపోయేరు. వారు భద్రంగా దాచిన కాల గుళిక వారి కథని మనకి చెప్పి ఉండక పోతే ఈ హృదయ విదారకమైన విచార గాథ కాలగర్భంలో కలసి పోయి ఉండేది.

మన సూర్య మండలం వదలి వెళ్లడానికి వీలయిన రాకెట్ యంత్రాల నిర్మాణం ఆ రోజులలో మనకి మాత్రం అర్థం అయిందా? మరొక రెండు శతాబ్దాల తర్వాతనే గదా మానవుడు చంద్ర మండలం చేరుకో గలిగింది! మరొక నాలుగు శతాబ్దాలు పోయిన తర్వాత, అంటే ఈ కథాకాలం నాటికి, కదా మానవుడు సూర్యమండలం వదలి ప్రయాణం చెయ్య గలిగే రాకెట్లు నిర్మించ గలిగేడు!

ఎంతమంది అసహాయ సూరుల్ని పొట్ట పెట్టుకుందీ నక్షత్రం?

జరిగిన ఈ అసలు కథ తెలియక ఈ నక్షత్రం అకస్మాత్తుగా ఆకాశంలో మెరిసిపోవడం చూసి, అది ప్రపంచ పరిరక్షకుడు, శాంతి దూత, కరుణామయుడు అయిన ఏసు ప్రభువు పుట్టేడనే వార్త ప్రపంచానికి చాటి చెప్పడానికి భగవానుడు ఆకాశంలో చూపిన సంకేతం అని మురిసిపోయేరు – బెత్లెహెమ్‌లో ఉన్న యూదులు. అమాయకులు!

క్లిష్ట పదార్థ దీపిక:

అత్యూదం = ultraviolet

కాల గుళిక = time capsule

కాలరంధ్రం = black hole

కుక్షింభరత్వం = materialism

చోదరి = pilot, driver

జ్యోతిర్వర్షం = lightyear

మహాయానం = big ferry boat

తేజోమేఘం = nebula

నభోనౌక = space ship

నీహారిక = nebula

యంత్రీభూతమైన = mechanistic

వాకేతం = signal

విన్యాసం = design

విరుద్ధోక్తి = oxymoron

శ్వేతకుబ్జతార = white dwarf

సంఘటన దిక్చక్రం = event horizon

సహస్రాబ్దం = millennium

హీనయానం = little ferry boat

హేతువాదం = rationalism

(ఆర్థర్ సి. క్లార్క్ రాసిన ''ద స్టార్'' అనే కథ దీనికి ఆధారం.)